# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 15-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా మారడమే భారతదేశ లక్ష్యమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుండి భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో కూడిన బృందం ఈరోజు సురక్షితంగా భూమిపైకి చేరుకుంది.
- భారతదేశ అభివృద్ధి ప్రస్థానంలో విద్య కేంద్ర బిందువుగా ఉండాలని కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి అన్నారు.
- భారతదేశ స్వచ్ఛ ఇంధన పరివర్తన జాతీయ లక్ష్యమని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి పునరుద్ఘాటించారు.

==============================

ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా మారడమే భారతదేశ లక్ష్యమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈరోజు ఒడిశా రాష్ట్రం కటక్‌లోని రావెన్‌షా విశ్వవిద్యాలయం 13వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి మాట్లాడుతూ... విద్యార్థులు తమ జీవితాంతం 'దేశం ప్రథమం' అనే ప్రతిజ్ఞను గుర్తుంచుకోవాలని, బాధ్యతతో సమాజానికి సేవ చేయడానికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ ప్రదాతలుగా మారాలని సూచించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ నిలవాలనే లక్ష్యాన్ని సాధించడంతో పాటు.. దేశ నిర్మాణంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

మరొక కార్యక్రమంలో 15వ శతాబ్దపు ప్రముఖ ఒడియా కవి సరళా దాస్ 6వ శత జయంతి వేడుకలలో రాష్ట్రపతి పాల్గొన్నారు. సరళా దాస్ ఒడియా సాహిత్యం, సంస్కృతికి చేసిన కృషిని ఆమె గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము మాట్లాడుతూ... విద్యార్థులు తమ మాతృభాషను విద్యా మాధ్యమంగా స్వీకరిస్తే, అది వారి ప్రతిభను మెరుగుపరుస్తుందన్నారు. మాతృభాషను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని రాష్ట్రపతి

పేర్కొన్నారు. అదే సమయంలో.. జ్ఞానాన్ని విస్తృతం చేసుకోవడానికి వీలైనన్ని ఎక్కువ భాషలు నేర్చుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు కళింగ రత్న-2024 అవార్డును ఆమె ప్రదానం చేశారు.

================================

ఆక్సియమ్-4 మిషన్ లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో (ISS) 18 రోజుల చారిత్రాత్మక మిషన్ ను పూర్తి చేసుకుని భారత వ్యోమగామి శుభాంశు శుక్లా తో కూడిన మరో ముగ్గురు సిబ్బంది సురక్షితంగా భూమిపైకి చేరుకున్నారు. ఈ రోజు కాలిఫోర్నియాలోని శాన్ డియాగో తీరంలో పసిఫిక్ మహాసముద్రంలో స్పేస్‌ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌక దిగింది. ISSను సందర్శించిన మొదటి భారతీయుడు గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా సురక్షితంగా భూమిని చేరుకోవడం పట్ల దేశ వ్యాప్తంగా సంతోషాలు వెల్లివిరిసాయి. ISSలో ఉన్న సమయంలో ఆయన సూక్ష్మ గురుత్వాకర్షణ ప్రయోగాలను నిర్వహించారు. ఇక అంతరిక్ష ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసిన భారత వైమానిక దళం గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అభినందించారు.

================================

భారతదేశ అభివృద్ధి ప్రస్థానంలో విద్య కేంద్ర బిందువుగా ఉండాలని పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి అన్నారు. న్యూఢిల్లీలో.. దేశంలో పాఠశాల విద్యపై జరిగిన సదస్సును ఉద్దేశించి ఈరోజు ఆయన మాట్లాడుతూ... దేశాభివృద్ధికి విద్య ప్రధానమని చెప్పారు. 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ నుండి, 2047 నాటికి 35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారతదేశం మారనున్న ప్రయాణం.... నాణ్యతతో కూడిన, సమ్మిళిత విద్యతో సాధ్యపడుతుందన్నారు. ఉత్పాదక శక్తి కలిగిన, బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దాల్సిన అవసరాన్ని వివరించారు. రాజ్యాంగం కల్పించిన విద్యా హక్కు ఫలితంగా అక్షరాస్యత నమోదు, పాఠశాల మౌలిక సదుపాయాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని హర్‌దీప్ సింగ్ పూరి అన్నారు.

================================

భారతదేశ స్వచ్ఛ ఇంధన పరివర్తన కేవలం పర్యావరణ లక్ష్యం మాత్రమే కాదని, ఇది జాతీయ లక్ష్యమని కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పునరుద్ఘాటించారు. ఈరోజు ఐఐటీ ముంబైలో జరిగిన ఐవీసీఏ పునరుత్పాదక ఇంధన సదస్సులో ఆయన మాట్లాడుతూ... 2030 నాటికి 500 గిగా వాట్‌ల (GW) శిలాజేతర ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రైవేటు పెట్టుబడులు ముఖ్యమని తెలిపారు. భారత్ రికార్డు స్థాయిలో పెట్టుబడులను, బలమైన విధాన మద్దతును పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని పొందుతోందని ప్రహ్లాద్ జోషి పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలలో పీఎం-కుసుమ్ యోజన విజయం సాధించిన నేపథ్యంలో, 20 రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతిపాదనలకు అనుగుణంగా ప్రభుత్వం త్వరలో ఈ పథకాన్ని విస్తరించనుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. సౌర, పవన వంటి పునరుత్పాదక రంగాలలో పెట్టుబడిదారుల ఆసక్తి పెరగడమే దీనికి కారణమని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.

విరామం

================================

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ ఈరోజు బీజింగ్‌లో చైనా అధ్యక్షులు జి జిన్‌పింగ్‌తో పాటు షాంఘై సహకార సంస్థ (SCO) సభ్యులను కలిశారు. భారత్, చైనా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలలో ఇటీవలి జరిగిన పరిణామాలను చైనా అధ్యక్షుడికి వివరించామని జైశంకర్ సామాజిక మాధ్యమంలో ఎక్స్ తెలిపారు.

==============================

కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) కార్యకలాపాలను పెంపొందించడానికి సామాజిక-ఆర్థిక ఆడిట్‌లను నిర్వహించాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పరిశ్రమలను కోరారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన 12వ జాతీయ CSR టైమ్స్ అవార్డ్స్ 2025లో ఆయన ప్రసంగిస్తూ.... పట్టణ, గ్రామీణ ప్రాంతాలు వైవిధ్యమైన సమస్యలను కలిగి ఉన్నాయన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, వనరులను సమర్థవంతంగా ఉపయోగించినట్లయితే గ్రామీణ పరిస్థితులను మార్చవచ్చునని అన్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలు నగరాలకు వలస వెళ్లడాన్ని ఆపడం సాధ్యపడుతుందని కేంద్రమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 35 సెకన్లు)

==============================

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (IICT) ముంబై ఈ సంవత్సరం ఆగస్టు నుండి తన మొదటి బ్యాచ్ విద్యార్థులకు ప్రవేశాలను కల్పిస్తోంది. ఒక అధికారిక ప్రకటన ప్రకారం... ఈ సంస్థ యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (XR) ఇండస్ట్రీ ఓరియెంటెడ్ కోర్సులను అందిస్తోంది. గత మే నెలలో జరిగిన వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (WAVES)లో ప్రకటించిన విధంగా గేమింగ్‌లో 6 ప్రత్యేక కోర్సులు, పోస్ట్ ప్రొడక్షన్‌లో 4 కోర్సులు, యానిమేషన్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ లలో 8 కోర్సులను ఐఐసీటీ మొదటి సంవత్సరం అందుబాటులో ఉంచింది.

==============================

బ్యాడ్మింటన్ క్రీడాకారులు పి.వి. సింధు, లక్ష్య సేన్, పురుషుల జోడీ సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టిలు రేపు టోక్యోలో జరగనున్న జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో పాల్గొంటారు.

==============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82,253 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమై... చివరికి 317 పాయింట్ల లాభంతో 82,570 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 113 పాయింట్ల లాభంతో 25,195 వద్ద ముగిసింది.

==============================

రానున్న మూడు రోజులు రాజస్థాన్, తూర్పు మధ్య భారతదేశంలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. గడిచిన 24 గంటల్లో పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒరిస్సా, కేరళ, జమ్మూ కాశ్మీర్, రాజస్థాన్, మధ్య మహారాష్ట్ర, అస్సాం, కర్ణాటకలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసాయని వెల్లడించింది. ఈ ప్రాంతాల్లో సగటున 7 నుంచి 20 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యిందని ఐఎండి పేర్కొంది.

==============================
==============================